

ఉప్పెనలా ముంచుకొస్తున్న గాలి తాకిడికి బాదంచెట్టు విపరీతంగా కదులుతున్నది. ఒక్కొక్క పండుటాకు రాలి పోతున్నది. అప్పుడప్పుడూ పండిన కాయలు కూడా.

'ఛ - ఏవిఁటీ పాడు గాలి' అనుకున్నాడు రాజారాం. ఓ తుంటరిగాలి కళ్ళనిండా మట్టి కొట్టి పోయింది. 'వి. రాజారాం' అని బయట తగిలించిన నేమ్ ప్లేటు అంతా మట్టికొట్టుకు పోయింది. విసుగ్గా లేచి భుజం మీదనున్న ఎర్ర తువాలుతో తుడిచాడు రాజారాం. దూళి విపరీతంగా రేగిందేమో ! - కళ్ళ జోడు మీదంతా దుమ్మే. కళ్ళజోడు తీసి ఒక

సారి కళ్ళు చికిలించుకుని తుడవడం మొదలుపెట్టాడు.

వీచి వీచి వున్నట్టుండి గాలి ఆగి పోయింది. 'హమ్మయ్య' అనుకున్నాడు. బాదం చెట్టు నీరసంగా వూగుతున్నది. పైన చిటారుకొమ్మకు రెండే రెండు ఆకులున్నాయి. వాటిలో ఒకటి ఎఱ్ఱగా మిగల పండింది. రెండోది దానికంటే తక్కువ ఎఱుపుదనంలో పండి వున్నది. వాటివంకే దృష్టి నిలిపి చూశాడు రాజారామ్. ఇంతలో కొద్దిగా పండిన ఆకు క్రిందకు రాలింది. 'అరే' అన్నాడు అప్రయత్నంగా. మెదడులో ఏదో మెరిసింది. అవును - నిజమే. ఇది ప్రకృతి విరుద్ధమే కావచ్చు. అయినా నిజం!

సాయంత్రం సైరన్ గాలిలో వూదర పెట్టి ఆగింది. ఇంటిముందు గొడవ గొడవగా సైకిళ్ళు-బళ్ళు పోతున్నాయి. ఇంటి కప్పు మీద ఇందాక పడిన ఎండుటాకులు విచిత్రమైన 'గరగర' శబ్దం చేసుకుంటూ పాకుతున్నాయి. ఇంటి ముందు పొద్దున్నే విరిసిన గులాబీ చుట్టూ సీతాకోకచిలుక రెండు రెక్కల్లో వేయి ఇంద్రధనుస్సులు విరియిస్తూ తిరుగుతున్నది. వస్తున్న చిరుగాలికి గులాబీ కదులుతూ ఎఱ్ఱటి పెదవులతో 'వద్దు వద్దు' అని చెబుతున్నట్టు వున్నది.

'అవును - అవును' అని గొణుగుతున్నాడు రాజారాం. కళ్ళల్లో రెండు గుండ్రని అశ్రుబిందువులు విండుగా పొర్లాయి. ఆ తెరల మెరుపులోంచి చూస్తూంటే జానకి - వద్దన్నా కనిపిస్తూనే వుంది.

పోయిన సంవత్సరం వరకూ తనతో పాటు యిదే పెంకుటింట్లో జానకి వుంది. ఇదే యింట్లో తమ సంసారం ముప్పయ్యేళ్ళు కాపురమున్నది. ఇదే యింట్లో 'బేబీ' పెళ్ళిచేశారు. ఇదే యింట్లో - జానకీ,తనూ కష్టాలు, కన్నీళ్ళు, సుఖాలు, చిరునవ్వుల పారిజాతాలు, బంధాలు, బాధలూ అన్నీ పంచుకున్నారు.

పోయినేడు!

పోయినేడు ఆ బంధం తెగింది.

కళ్ళముందు జానకి - వెడల్పాటి పెద్ద కుంకుమబొట్టు పచ్చటి నుదురు మీద. చిన్న గడ్డం. కళ్ళకు సూటిగా చూస్తే వింతగా మెరిసే ఆ ముక్కు-- ఆ ముక్కు క్రిందగా చిన్ని నల్లటి పుట్టుమచ్చ. బచ్చలిరంగు చీర, మధ్య మధ్యన చిట్టి చేమంతుల్లాంటి పువ్వులు.

పోయినేడు - ఆ రోజూ - జానకి అలాగే వుంది. కానీ పచ్చటి ముఖంలో ఆ వింత మెరుపు లేదు. పెదవులమీద చిరునవ్వు పారిజాతాలు విరియడం లేదు. తడి తడిగా వంటికంటుకుపోయిన చీర. బ్రతికుంటే ఎంతగా అసహ్యించుకొనేదో - జానకి. జానకిలో వుండాల్సినదేదో లేదు.

అవును - అప్పుడు జానకిలో అసలు జీవం లేదు. ఏది చేస్తే అది చేయించు

కునే జడత్వం వుంది. కదలని కట్టె లాంటి తత్వం వుంది. అవును పోయి నేడు తనని వీడి ఈ లోకాన్ని వీడి వెళ్ళిపోయింది.

ముందు వెళ్లాల్సినవాడు తను.

ముందు వెళ్ళింది - ఆమె.

ప్రకృతిసహజం - తాను ముందు పోవడం.

కాని పోయింది జానకి.

ధారగా ఆలోచనలు కప్పేస్తున్నాయి రాజారాంను.

* * *


పొద్దున్నే లేచి చిరాగ్గా ఒళ్లు విరుచుకున్నాడు—రాజు. కప్పుకున్న దుప్పటి తీసి అవతల పారేసి నోట్లోంచి ఆవిరిని రింగురింగులుగా బయటకు రప్పించి విచిత్రంగా ఆవులించాడు. చలికాలం కావడం మూలాన నోట్లోంచి పొగ పొరలుగా బయటికొచ్చింది. ఆ వెంటనే కళ్ళు నులుముకుని తుమ్మచెట్టువైపు చూశాడు. పిల్లలంతా గడ్డీ, దూగరా పోగుచేసి చలిమంట వేసుకుంటున్నారు. పరుగున అక్కడి కెళ్ళి కూచున్నాడు. అక్కడ వాళ్ళ కబుర్లు విని అటూ యిటూ చూశాడు. ఆ కళ్ళు వెదికేది మరో జత కళ్ళకోసం. కానీ వెదకుతున్న కళ్ళకు కావలసిన కళ్ళు కనిపించనేలేదు. ప్రక్కింటి ఈశ్వరరావుగారబ్బాయి అందులోకి పెంకులు, రాళ్ళు వేసి వేడి చేసి బయటికి తీసి దానిమీద నీళ్ళు పోసి ఆటలాడుతున్నాడు. బాచీగాడు గడ్డి గొట్టాలు నోట్లో వుంచుకుని పొగ రప్పించి విచిత్రంగా అరుస్తున్నాడు.

"ఒరే-రాజు బడి టయిమవుతున్నది-లోపలికి రా"-యింతలో అన్నపూర్ణమ్మ పిలవనే పిలిచింది. లేచి యింట్లో కొచ్చాడు రాజు. పొగలు కక్కుతున్న నీళ్ళలో చన్నీళ్ళు కలుపుకుని స్నానం చేసి తువ్వాలుతో తుడుచుకుంటూండగా తమ్ముడు బాచీ తన పుస్తకంలోంచి నెమలి కన్నులన్నీ తీసి నలిపేయడం కంట బడింది. ఒక్క ఉదుటున పరుగెత్తి వాడి నెత్తిమీద ఒకటి మొట్టి పుస్తకం లాక్కున్నాడు. వాడు పెద్దగా ఏడుపు లంకించుకున్నాడు. అన్నపూర్ణమ్మ ఆదరా బాదరా బయటికొచ్చి వాణ్ణి బుజ్జగించి "ఏరా, రాజూ! అన్నేళ్ళు వచ్చాయ్ - ఇంకా ఆ నెమలికన్నులతో ఆటలేవిటి? వాడికిచ్చెయ్" అన్నది.

రాజు ఒకసారి తల ఎగరేసి - దూరంగా వెళ్ళి నెమలికన్ను ఆప్యాయంగా చూసుకున్నాడు. ఒక్కసారి ప్రేమగా నిమురుకున్నాడు. ఆ నెమలి కన్ను వింత మెరుపులో మరో రెండు కళ్ళు మెరుస్తున్నాయి.

ఇంట్లోకి పోయి తన పుస్తకాలన్నీ సర్దుకున్నాడు. పైన ఇంగ్లీషు పుస్తకం పెట్టుకున్నాడు. గుండ్రటి అక్షరాలు "వి. రాజారాం, 9వ తరగతి" - ఆ అక్షరాల్లో ఎవరిచేతుల మార్దవం దాగి

తరువాత పేజీల్లో చూడండి!




వుందో, ఎవరి హృదయపు వెచ్చదనం నిండి వుందో - ఆమెకోసం తన కళ్ళు పరితపిస్తున్నాయి.

బడికి బయల్దేరాడు. నడుస్తూ అక్షరాలు గాలిలో వ్రాస్తున్నాడు- 'జానకి - జానకి' అంటూ. 'జానకి వుందో వెళ్ళిపోయిందో.'

సాధారణంగా జానకి రాజు రావిదే స్కూలుకెళ్ళదు. ఇవ్వాళ కూడా వుండే వుండాలి - అని తల పైకెత్తి చూశాడు. ఒంటెద్దు బండి తోలుకుంటూ నారయ్య తాతయ్య పోతున్నాడు. బండిలో పెసర కాయలున్నాయి. వాటిని కొన్ని లాగి జేబులో వేసుకున్నాడు. ఆలోచనలతోనే మాస్టారింటికి చేరాడు. ఇంటిముందున్న గొబ్బెమ్మల్ని కొన్నింటిని తొక్కి- 'అయ్యో' అనుకున్నాడు. ముగ్గు సముద్రపు నురగంత తెల్లగా వున్నది. 'జానకి వుంటే యీపాటికి తన గొబ్బెమ్మల్ని తొక్కేశాడని గోల చేసేదే నే- ఏమయిందో?'

ఎదురుగా మాస్టారు నిలబడి వున్నారు. పొడవాటి లాల్చీ-కళ్ళజోడు- అందంగా వున్నాడాయన. "మాస్టారూ- జానకి వుందా? స్కూలు కెళ్ళిందా?" అని అడిగాడు రాజు.

"లేదయ్యా. నిన్నరాత్రి వాళ్ళమ్మా- అదీ కల్సి మా చెల్లెలువాళ్ళింటికి వెళ్ళా

రయ్యా. అదే, పొలమనేరు. రెండు - మూడ్రోజుల్లో రావచ్చు." అని మాస్టారు స్కూలువేపు సాగిపోయారు.

క్షణంపాటు బిత్తరపోయాడు రాజు. గుండెమీద చెయ్యి వేసుకుని చూసుకున్నాడు. స్థాణువులా నిలుచుండి జానకిని గురించి ఆలోచించడం మొదలెట్టాడు. 'జానకి - అవును. చిన్నప్పటినుండి ఒక చోట పెరిగిన జానకి తనను వొదిలి యివాళ వాళ్ళ అత్తయ్యగారింటికి వెళ్ళింది. ఎన్నడూ లేదే యిలా' అనుకున్నాడు రాజు.

'ఇదే మొదటిసారి జానకి లేకుండా స్కూలుకి వెళ్ళడం' అనుకుంటూ స్కూలుకు చేరాడు. 'గణగణ' మొదటి గంట మ్రోగింది. గుండెల్లో చెప్పరాని తపన. దూరంగా పొలంగట్టున ఓ నల్లటి పక్షి తమాషాగా రెక్కలు విప్పుకుని పైకి ఎగిరి మళ్ళీ క్రిందికి వస్తున్నది.

'జానకి ఏమయింది? నీతోపాటు రాలేదే?" పిల్లలంతా అతన్నే అడిగారు. ఏమని చెప్పగలడు?

ఇంతలో రెండో గంట మోగింది. పిల్లలందరూ బిలబిలమంటూ స్కూలు లోపలికి వెళ్ళిపోయారు. ఒంటరిగా అతనొక్కడే. ఆ కాళంలో మబ్బులు నెమ్మదిగా కదుల్తున్నాయి. జానకీ-తనూ స్కూలు వదిలిపెట్టగానే కలిసి ఎలా వెళ్ళేది గుర్తుకొచ్చింది. ఓసారి తనూ, జానకి నడుస్తున్నారు - రంగారాయుడు గారి మామిడితోట వెంబడి. జానకికి నోరూరింది. తనకి ఆ విషయం చెప్పింది. ఎదురుగ్గా, దగ్గరనే వున్న చెట్టుకి క్రింది కంటా వ్రేలాడుతున్నాయి - కాయలు. వాటిని 'కలెక్టరు మామిడికాయలు' అంటారు. ముందు రాయితో కొట్టాడు తను. పడలేదు. నెమ్మదిగా జానకిని కాపలా వుంచి ఆ తీగల సందుల్లోంచి లోపలికి పోబోయాడు. చొక్కా అందులో చిక్కుకుంది. జానకి వచ్చి తప్పించి- 'ఊ' అంటూ కళ్ళు తిప్పింది. అంతే! గభాలునా నాలుగు కాయలు కోసి పరుగులో తీసుకొచ్చాడు. మళ్ళీ తీగల్లోంచి రాబోయాడు. చిక్కుకున్నాడు. ఈసారి తీగల ముళ్ళల్లో మాత్రం కాదు. తోటమాలి చేతుల్లో. ఎక్కడినుంచి వచ్చాడో ఏమో! యముడిలాగా-కళ్ళల్లో చింతనెగళ్ళు రగుల్చుకుంటూ-'ఎవర్రా నువ్వు' గట్టిగా కేకేశాడు. వాడి చేతుల్లో తను అకులా వొణికిపోతున్నాడు.

అప్పుడు-అప్పుడు, జానకి దిక్కులు కరిగేలా ఏడ్చింది. తనను వదిలిపెట్టమంది. 'కావాలంటే నన్ను పట్టుకు కొట్టు' అంది. 'అసలు నేనే రాజుకు కోయమని చెప్పింది' అన్నది. ఇదంతా చూసి తోటమాలి కరిగిపోయాడో ఏమో- 'సరే, పొండి. మళ్ళీ ఈ ఛాయలకు మాత్రం రావద్దు' అని కాయ లిచ్చి పంపేశాడు.

ఆ తర్వాత - ఒకళ్ళను ఒకళ్ళు

ఓదార్చుకోవడం - ఒకళ్ళు కారం - మరొకళ్లు ఉప్పు తేవడం-ముక్కలు కోయడం - పంచుకోవడం - బాదిద చెట్టు క్రింద యిరువురూ తినడం అంతా కళ్ళముందు లాస్యమాడుతోంది.

రాజు గాలిలో 'అవును' అంటూ వ్రాశాడు. లోపల బడిలో ఒకటే సందడిగా వుంది. "అవును - జానకి ఎప్పుడూలేదు నన్ను విడిచి. నేను వెళ్ళి పోవాలి- జానకిని చూడాలి, యిప్పుడే" - పరుగు పరుగున యింటికొచ్చి పడ్డాడు రాజు.

అమ్మ యింట్లో లేదు. నాన్న పొలా నికి వెళ్ళినట్టున్నాడు. తనొక్కడే 'పొలమనేరు' వెళ్ళాలి.

అటూ యిటూ చూశాడు. పైన అటక క్రింద సామాన్లు. వంటగది-ఆ వంట గది ప్రక్కనే దేవుడి మందిరం. అక్కడి కెళ్ళాడు. తను రోజూ డబ్బులు దాచు కునే ముంతదగ్గరి కెళ్ళాడు. ముంత మోగించి చూశాడు. 'గలగల' మోగింది. పగలగొట్టి డబ్బులన్నీ జేబులో వేసు కున్నాడు.

పగిలిన ముంతను చూసి 'అయ్యో' అనుకున్నాడు బయల్దేరాడు. గుండెల్లో ఏదో ఆరాటం—కళ్ళల్లో ఆవిరి-చెవుల్లో హోరు-శ్వాస ఎగదట్టుకుంటూ బయలు దేరాడు. ఎక్కడికి — ఎందాక? 'పొలమనేరు'.

'అదెక్కడ?'

'ఎక్కడో వుండే వుంటుంది.'

'బస్సువాళ్ళ నడుగుదాం, వాళ్ళే చెబుతారు.'

బస్సుస్టాండు చేరాడు. అక్కడ ఎర్ర బస్సులు - హారన్లు - గందరగోళంగా వుంది. ఆ ప్రక్క ఓ ముగ్గురు-కబుర్లు చెప్పుకుంటున్నారు. అందులో ఓ కుర్రాణ్ణి అడిగాడు- 'పొలమనేరు పోవ డానికి ఏ బస్సెక్కాలి' అని. అతను ఏదో చెప్పాడు. బస్సు దిగి రెండు మైళ్ళ దొంక దారంట నడవాలట.

బస్సొచ్చింది. కదిలింది. బస్సులో రొద. తను చిల్లరంతా లెక్కబెట్టి కండక్టరు కిచ్చాడు. టిక్కటిస్తూ కండ క్టరు తనవైపు అదోలా చూశాడు. భయ మేసింది. బస్సులో ఒకటే గందరగోళం- కొంతమంది పాలతట్టలు పెట్టుకుని ఎక్కారు. ప్రక్కగా ఎండురొయ్యల కంపు. పచ్చిచేపల తట్ట తన పక్కన పెట్టుకుని ఎక్కింది ఎవరో ఒకావిడ. తను మాత్రం - జానకి గురించే ఆలో చిస్తున్నాడు.

ఒకటి-రెండు-రెండు గంటలయింది. బస్సు ఆగింది పొలమనేరులో. దిగాడు.

దిగి ఒక్క క్షణం తన ముందున్న ఓ కొత్త ప్రపంచాన్ని తనెప్పుడూ చూడని వింత లోకాన్ని చూడగల్గినంత మేర చూశాడు కొత్త వాతావరణం. ఆ మాట కొస్తే బస్సెక్కడం మాత్రం- ఇది అయిదోసారో - ఆరోసారేమో,

అంతే. అందునా ఒక్కడే ప్రయాణం చేయడం బహుశా యిదే మొదలు. తలచుకుంటే ఏదో కొత్త భయం గుండెల నిండా నిండిపోతుంది.

బస్సు దిగిన నాలుగయిదు నిమిషాల్లోనే వర్షం ప్రారంభం అయింది. కొద్ది కొద్దిగా చినుకులు పడ్తున్నాయి. మనసు ఎగిరెగిరి పడ్తున్నది– నీటిలోంచి బయటకు విసిరిన చేపలాగా. డొంకదారి గుండా ప్రయాణం–అప్పైన ఒంటరితనం.

కదులుతూ పోతూంటే ఎన్నెన్నో– గుర్తుకొస్తున్నాయి. గుండెల గదుల్లో భద్రంచేసిన జ్ఞాపకాలు ఒకొక్కటి కళ్ళ ముందుకొచ్చి కనిపిస్తోంది. ఈఅనుభవం కొత్తది– సరికొత్తది. ఈ అనుభూతి చాలా వింతయినది. ఇద్దరూ కలిసి కట్టుకున్న యిసుక గుళ్ళు–ఆడినఆటలు– చేసిన బొమ్మల పెళ్ళిళ్ళు.

గుండ్రంగా వుండే ఆ కనుబొమ్మల్ని చక్రాల్లా కదిపి పారిపోతుంటే ఎంత అందంగా వుండేది జానకి? ముక్కు క్రిందగా వున్న పుట్టుమచ్చ ఎంత చక్కగా మెరిసేది?


....దారి అంతా బురద బురద. ఆ రొచ్చులోంచి కదులుతున్నాడు. వర్షం తగ్గిపోయింది. చల్లటిగాలి వీస్తున్నది. అతని పెదవులు కంపిస్తున్నాయి. అటూ యిటూ తుమ్మచెట్లు. అక్కడా చింత చెట్లు. తలస్నానంచేసి ఆరబెట్టుకుంటు న్నట్టు వున్నది ఆ దృశ్యం. ప్రక్కనే ఓ పెద్ద తుమ్మచెట్టు వేళ్ళు భూమిలోంచి పైకి లేచి లావుపాటి సర్పాల్లా భయంకరంగా వున్నాయి. అక్కడక్కడా జిల్లేడు మొక్కలు. ఉమ్మెత్తలు. గుండ్రని కాయలు. ఆ కాయల్లో ముళ్ళు. వీటితో తాము స్కూల్లో చిన్నప్పుడు ఆడుకునేవాళ్ళం. 'అవి తింటే చచ్చి పోతారు. నాన్న చెప్పారు' అని జానకి ఒకసారి తనతో చెప్పింది. అంతే! ఆ తర్వాత వాటిని మళ్ళీ ముట్టుకుంటేఒట్టు!

దారిప్రక్క చెట్లనుంచి వానకు విలిచిన చుక్కలు ఒక్కొక్కటి బరువుగా తలమీద పడ్తున్నాయి. హృదయంలో ఆవేదన—ఏదో తొందర – ఉద్వేగం–ఏదో ఊపిరిసల్పని సందేహం! ఏదో కొత్త ఉత్సాహం! ఒక్కొక్క అడుగూ బరువుగా పడుతున్నది. జేబులోని చిల్లర ఘల్లుమంటున్నది. ఎండ కొంచెంగా వచ్చింది. వర్షం మళ్ళీ సన్నటి తుంపర ప్రారంభమయ్యింది.

ఆకాశంలో, రెండు కోనల్ని కలుపుతూ – ఇంద్రధనుస్సు విరిసింది. రంగురంగులతో ఒకటా – రెండా ఏడు– కాదు–ఎన్నెన్నో రంగులతో సౌందర్యాన్నంతా కరిగించి ముద్ద పోసినట్లు ఎంత అద్భుతంగా వుందో! జానక్కి యిది చూపించాలి–'తను అక్కడికి వెళ్ళేదాకా వుంటుందో – వుండదో'–

మళ్ళీ నడక తొందరగా సాగిస్తూ బయల్దేరాడు.

తరువాత పేజీల్లో చూడండి !




జానకి అక్షరాలు ఎంత గుండ్రంగా వుంటాయ్. ముత్యాల్లాటి అక్షరాలతో నోట్సులు ఎంత అందంగా వ్రాస్తుంది? తనూ యింకా ఎంతోమంది మాస్టారి దగ్గర ప్రైవేటు చెప్పించుకునేవాళ్ళం. జానకీ, తను మాత్రం ఒకే దీపంముందు కూర్చుని చదూకునేవాళ్ళం. నిన్నటి వరకూ కలిసి వున్న తాము యిప్పుడిలా విడిపోయి....

జానకితో అందరూ తమ నోటు పుస్తకాలమీద పేర్లు వ్రాయించుకునే వాళ్ళు. కానీ, అదేం చిత్రమో! ఆమె మాత్రం తనచేత ఆమె నోటుపుస్తకాల మీద పేర్లు వ్రాయించుకుని మురిసి పోయేది. నా అక్షరాలు జానకి అక్షరాల కంటే బాగోవు. మరి ఎందుకు? ఏమో—

రాజుకు మరో సందేహం వచ్చింది. 'అవును - ఇల్లెక్కడో. తెలీదే.'

'ఆ మాట కొస్తే యీ వూరు మాత్రం తెలుసా? కనుక్కోవాలి.'

'పేరు కూడా తెలీదే వాళ్ళత్తయ్య వాళ్ళది, ఏమని అడగాలి?'

— సందేహాలు.

ఊళ్ళోకి వచ్చాడు. ఊరి మధ్యలో ఓ పెద్ద రావిచెట్టు. ఆ ప్రక్క కోమటి దుకాణం. ఒకటి రెండు బడ్డీలు. ఎవరో ఒకమ్మాయి, కోమటింట్లోంచి నూనె

సీసాలో పోయించుకుని పట్టుకుపోతోంది. ఎవరూ ? - ఉహూ జానకి కాదు.

కోమటి కొట్టు దగ్గర ఆగాడు. నల్లగా వుండి హడావుడిగా సరుకులు ఇస్తున్నాడు. చిన్న చిన్న గరిటెలతో నూనె పోసి డబ్బులు తీసుకుని గల్లా పెట్టెలో వేసుకుంటున్నాడు. 'బాబూఫలావి వూరువారు యిక్కడి కొచ్చారు. వాళ్ళ సంగతి ఏమైనా తెలుసా' అని అడిగాడు రాజు. అతను చిరాగ్గా తెలీదు పోవయ్యా అని కసిరాడు. మళ్ళీ కదిలాడు రాజు.

ప్రక్కనే ఎవరిదో యిల్లు - అది గాదు అక్కడ -

ఉహుం—ఇంకో చోట – ఉహుం -

మరో దగ్గర — ఉహుం

మరెక్కడ? ప్రశ్నలు – ప్రశ్నలు.

ఊరు ఊరంతా దాదాపు తిరిగాడు. ఎక్కడా ఎవరికీ తెలీదన్నారు. చివరికి అలసిపోయి రాములవారి గుడి ముందున్న మంటపంలో కూర్చున్నాడు. అక్కడ గాలికెగిరి వచ్చిన పండుటాకులు — ధూళీ కమ్ముకుని ఉన్నాయి. కొంచెం చోటు సరిజేసుకుని కూర్చున్నాడు.

ఆకాశానికి ఒక మెట్టు క్రిందుగా తెల్లటి కొంగలు వరుసగా వెళ్ళిపో తున్నాయి. వేళ్ళు చూసుకున్నాడు. వేళ్ళ గోళ్ళమీద తెల్లగా మచ్చలున్నాయి. కొంగల్ని చూస్తే వేళ్ళ గోళ్ళమీద తెలుపుగా మచ్చలొస్తా యంటారు.

ఆ ప్రక్కన ఎవరో పిల్లలు ఆడుకుంటున్నారు. 'అంటుకునే ఆటలు'- 'కళ్ళకు గంతలు-తొక్కుడు బిళ్ళలు-' యిలా రకరకాలుగా ఆడుకుంటున్నారు అక్కడ - మంటపం వెనుక - పిల్లలతో మల్లెపూల మధ్య ముద్ద మందారంలాగా. మబ్బుల మధ్య మెరుపుతీగలాగా - ఓ ప్రక్కగా - జానకి కనిపించింది. అవును - జానకి!

'జానకీ' - గట్టిగా అరుద్దామను కున్నాడు. మాట పెగలందే. జానకిక్కొంచెం దగ్గరగా వెళ్ళాడు. తనివితీరా చూశాడు. జానకి మాత్రం తన ఆటలో తాను నిమగ్నమయి వుంది. 'అవును - తన జానకే' మరోసారి అనుకున్నాడు. ఏమీ మాట్లాడలేదు.

హృదయంలో ఏదో తేలిక. తెల్లటి మెరుపు. మల్లెపూల గుబాళింపు - మంచి గంధం రాసుకున్నంత చల్లదనం.

వచ్చిన పని అయినట్టే. చూశాడు- జానకిని.

జానకితో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. తనొచ్చింది చూడడానికే. అంతే! చూశాడు.

మళ్ళీ వడి వడిగా నడక ప్రారంభించాడు. డొంకదారి గుండా.

* * *

రాజారాంకు కళ్ళలోనీళ్ళు గుండ్రంగా తిరిగాయి.

గబ గబా యింటిలోకి వెళ్ళి పెట్టె లోపల దాచిన ఆల్బమ్ బయటికి తీశాడు.



ఒకొక్క ఫోటో నెమ్మదిగా చూడటం మొదలెట్టాడు. తన చిన్నప్పటి ఫోటో. అమ్మా, నాన్నలతో దిగిన ఫోటో. ఆఁ! యివీ తన పెళ్ళి ఫోటోలు. జానకి తలవంచుకుని వుంది. ముత్యాల్లాంటి తలంబ్రాలు పడుతున్నాయి.

తరువాత – ఆఫీసువాళ్ళందరితో కలిసి తీయించుకున్న ఫోటో. తన మిత్రుడు రాఘవరావు కూడా వున్నాడు ప్రక్కన.

ఆఁ – యిది తనూ, జానకీ, బాబులతో వున్న ఫోటో. దీంట్లో ఎంత అందంగా వున్నది జానకి. బాబు – వాడి సంగతి ఎత్తితే – దుఃఖం పొర్లి వస్తున్నది.

తరవాత – ఫోటోలో తనూ, జానకీ, బేబీ బాదంచెట్టుక్రింద తీయించుకున్నది.

అవును – ఆ బాదంచెట్టు ఎన్ని కఠోర సత్యాలకు, ఎన్ని ఆనందాలకు, ఎన్ని దుఃఖాలకు, ఎన్ని అనుభవాలకు సాక్షిగా నిలిచింది!

జానకిని పెళ్ళిచేసుకున్న కొద్దిరోజుల్లోనే కష్టాలు ప్రారంభం.

ఉద్యోగంలో - రిట్రెంచ్‌మెంట్. తను నిరుద్యోగి అయిపోయాడు.' అప్పటి ఫోటో కూడా ఒకటి వుండాలి!

జానకి తనకెంత గుండె నిబ్బరాన్నిచ్చింది! తనతోపాటు జానకి, ఆకలినీ, కష్టాల్ని మోసింది. తనూ సగం పాలు భరించింది. తనే కాదు మరో ప్రాణి కూడా. బాబు! బాబు పుట్టాడు.

తను ఎంతెంతగా పొంగిపోయాడో!

మరి ఆకలి - కష్టాలు — ఆ పసికూన తట్టుకోగలదా?

తాము యిద్దరం ఏదో విధంగా కాలం గడపగలం. కానీ, బాబు - నో - అలా కావడానికి సమ్మతించను. ఆ వెంటనే బాబును నాన్నవాళ్ళు తీసికెళ్ళారు. తాతయ్య వాళ్ళింట్లో బాబు హాయిగా వున్నాడని అప్పుడప్పుడూ తెలుస్తూనే వుండేది.

ఒక సంవత్సరం తర్వాత - ఓ వంద ప్రయత్నాల తర్వాత, వేయి ప్రయాసల తర్వాత గవర్నమెంట్ వుద్యోగం వచ్చింది. అప్పటితో తమ కష్టాలు తీరేయి. జానకి మరో బిడ్డను ఎత్తుకోడానికి సిద్ధంగా వుంది.

పుట్టిన బిడ్డ ఆడపిల్ల. కళ్ళు మెరిసాయి. బంధువులంతా అదృష్టవంతుడవన్నారు. ఆపరేషన్ చేయించెయ్యమన్నారు. ఎందుకో శంక కలిగింది. ఎందుకో చెప్పలేను. అయినా ఆ రోజుల్లోనే - ఆపరేషన్ జరిగిపోయింది. గ్రామస్థులంతా తన వైపు వింతగా చూశారు.

మరో ఏడు మామూలుగా గడిచిపోయింది. బాబును యిక్కడకు పంపెయ్యమని వుత్తరాలు వ్రాశాను. ఊహూం అప్పుడేకాదు. మరో ఏడాది తర్వాత అన్నారు - నాన్నవాళ్ళు.

ఆ రోజు తనూ, పాపా, జానకి బాదంచెట్టు క్రింద కూర్చున్నారు. గాలి వీస్తున్నది. నెమ్మదిగా బాదంచెట్టు వూగుతున్నది.

జానకి - ఏదో కథ చెప్పడం మొదలెట్టింది — నేను ఊకొడ్తున్నాను. 'సీతాదేవి ఎందుకో అడవుల ప్రశాంత వాతావరణంలో, ఋష్యాశ్రమం దగ్గర కొంతకాలం గడపాలని కోర్కెకల్గింది. అయితే యింతలో చారుడు ఓ వార్త మోసుకొచ్చాడు. 'ఓ చాకలి వాడు రాముడ్ని దూషించడం-సీతను అవమానించడం' యిదంతా పూసగుచ్చినట్టు చెప్పాడు — రాముడితో, విచారంతోనే.

రాముడు - వెంటనే లక్ష్మణుని పిలిచి తన వదినగారిని అరణ్యాలలో వదిలి రావలసిందిగా కోరాడు. లక్ష్మణుడు అన్నమాట జవదాటలేడు కదా! అందుచేత ఆవిడను తీసుకునివెళ్ళి వదిలి వచ్చాడు.

సీతమ్మ అప్పుడు గర్భవతి. నడుస్తున్నది. ఎండ. చెమటలు. ఇదిచూసి ఓ

కొబ్బరిచెట్టు ఆమెకు నీడనిచ్చింది. దాని కామెసంతోషించి 'నీ కెప్పుడూ సంతానం వుంటూనే వుంటుంది.

నీ చంకన ఓ బిడ్డ, చేతిలో ఒక బిడ్డ, కడుపులో ఒక బిడ్డ వుంటారు' అంటూ దీవించింది.

సరే — మళ్ళీ నడవసాగింది - అప్పుడు ఓ అరటిచెట్టు కనిపించింది. అరటిచెట్టు సీతాదేవి అవస్థను చూసి ఫక్కున నవ్వింది.

సీతమ్మకు కళ్ళల్లోంచి నిప్పులు రాలాయి. తను యింత విషాదస్థితిలో వుంటే నవ్వుతుందా అని శపించింది.

'నీ బిడ్డను నువ్వు చూసుకోలేవు. అంతేకాక - నీకు పుట్టేది ఒకే బిడ్డ. నిన్ను కొట్టి నీ బిడ్డను మనుషులు లాక్కుంటారు' అని అన్నది...."

ఇంకా ఏదో చెప్పబోయింది జానకి.

ఇంతలో ఉప్పెనలాగా ఒక వార్త వచ్చి పడింది.

"బాబు - ఆడుకుంటూ - ఆడుకుంటూ బావి దగ్గరకెళ్ళి...." అని అంతే కుప్పలా కూలిపోయాం యిద్దరం. జానకి దుఃఖం వర్ణనాతీతం.

అరటిచెట్టు జ్ఞాపకాని కొచ్చింది. అవును తమ బ్రతుకూ అంతే యిక. ఒకే గెల - అవును ఒకే ఒకటి.

* * *

కళ్ళు వత్తుకున్నాడు రాజారాం. బాదం చెట్టునించి ఓ పండిన కాయ రాలింది. నుదుటిమీదిగీతల్ని ఒకసారి స్పృశించాడు. జుట్టంతా ఒకసారి సరిజేసుకున్నాడు.

మళ్ళీ ఆల్బం తెరిచి ఫోటోలు తిరిగేయడం మొదలుపెట్టాడు.

ఆఁ - మళ్ళీ తన యింట్లో ఆనందం అప్పుడే వెల్లివిరిసింది.

బేబీ పెళ్ళి ఫోటోలు - అవన్నీ. అల్లుడు కూడా వున్నాడు. జానకి ఎంత జబ్బుతో వుండి కూడా ఎంత చురుగ్గా, చలాకీగా తిరిగింది ఆరోజు. ఉత్సాహం- కూతురి పెళ్ళి కదూ!

ఇప్పుడు బేబీ తనను - తన ఒంటరి తనాన్ని పూనాలోంచే ఒకసారి తలచు కోవచ్చు. బేబీని గొప్ప చదువులు చది వించాలనుకున్నది-జానకి. చదివించింది. పెళ్ళి కూడా చేశాడు. అంతే! అప్పటి వరకూ వున్నపనీ - తీరికలేని తనం యివన్నీ పోయి యిప్పుడు యిలా మౌనంగా నిస్త్రాణగా, మూగవోయి కూచోవలసిందే. పని వుండాలి మనిషికి- అది లేకుంటే ముసురులా వుంటుంది జీవితం!

ఎవరో వీధిలోంచి అరిచారు. ముష్టి వాడు. జానకి బ్రతికున్నంతకాలం వాడికి ప్రతిరోజూ ఏదో ఒకటి పెట్టేది. అరచి అరచి పోయాడు. తనకూ ఆ ఓపిక లేదు. కొంచెం కొంచెంగా చీకటి పడుతున్నది.

మళ్ళీ ఆల్బం తీసి చూడటం చేస్తూనే వున్నాడు.

బేబీ, వాళ్లాయన-ఫోటో యిది.

తరవాత ఫోటో చూడటానికి భయమేసింది రాజారాంకు. అది జానకి చనిపోయినప్పుడు తీసినది. కట్టెలా పడి వున్న జానకిని అటూయిటూ బేబీ, యింకొక అమ్మాయి పట్టుకుని నిలుచున్నారు.

ఆశ్చర్యం!

ఎప్పుడు తన మరణాన్ని గురించి ఆలోచించేవాడు క్రితంలో. కానీ ఏనాడూ ఆమాటయినా ఎత్తని జానకి యిలా ముందు తనే పోతుందని కలలోనయినా అనుకున్నాడా? తను స్వార్థపరుడు. అప్పటివరకు జానకితో ఎన్ని పనులు చేయించుకునేవాడు. చనిపోయిందని తెలియగానే, ఇక మాట్లాడదనీ, కదలదనీ తెలియగానే ఆమెను సమాధి చేసేశాడు. తను పాపి!

ఇక తనకు విశ్రాంతి ఎప్పుడో. ఇంట్లోకి వెళ్ళాడు.

కరెంటు లేనట్టుంది. అగ్గిపుల్ల తీసి వెలిగించాడు. ఆ వెలుగులో బల్లమీద మధ్యాహ్నం తానుంచిన వుత్తరం ఎగురుతున్నది. బేబీ నుంచి వచ్చిందా వుత్తరం అక్కడికి వచ్చేయమంటూ. ఇద్దరూ రాశారు. ఎలా వెళ్ళగలను? పాపం— అల్లుడుగారు కూడా ఎంత ఆప్యాయంగా వ్రాశాడు? కానీ తను యిక్కడ వుండాలి.

బయట పిల్లలఆటలు తగ్గిపోయాయి రణగొణధ్వని తగ్గిందికానీ లారీలు, హారన్లు-రిక్షా బెల్లుల మ్రోతలు యింకా వినబడ్తూనే వున్నాయి. బాదంచెట్టు కొద్ది కొద్దిగా కదులుతుంది.

దూరంగా 'ఫైరింజన్' గంటలు కొట్టుకుంటూ వెళ్తున్న చప్పుడు. పాపం ఎవరి ఇల్లో కాలిపోతోంది.

మనసులోంచి మంటలు లేస్తున్నాయి. వీటిని ఆర్పగలిగే దెవరు? పైన ఆకాశం అతుకుల దుప్పటి కప్పుకున్నట్టు-మబ్బు పట్టివుంది.

ఒక్కసారి నిట్టూర్చాడు రాజారాం. ఒకసారి తన యింటివైపు చూసుకున్నాడు ఒంటరితనంలో తనూ-ఇల్లూ.

జానకి మళ్ళీ మళ్ళీ కనిపిస్తూనేవుంది. బాబు కళ్ళముందు మెరుస్తూనే వున్నాడు. ఒంటరితనం ...

పైన బాదంచెట్టు మీద పండిన ఆకు గాలికి రెపరెపలాడుతూనే వుంది.

